# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com


హైదరాబాద్ శనివారం 17 జనవరి 2026 | www.balagamtv.com | పేజీలు 4


## 30న వాటర్ డిస్ప్యూట్ కమిటీ సమావేశం

బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య నదీ జలాల వివాదాల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ జనవరి 30న సమావేశం కానుంది. సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) శుక్రవారం మీటింగ్ నోటీస్ జారీ చేసింది. మూడు నెలల్లో తన నివేదికను సమర్పించాల్సి ఉన్న నేపథ్యంలో కమిటీ మొదటి సమావేశం న్యూఢిల్లీలోని సేవా భవన్‌లో ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న నదీ వివాదాలపై నోటిఫై చేయనున్నారు. తదుపరి చర్చల కోసం నీటి నిర్వహణకు సంబంధించి రెండు రాష్ట్రాలు వివరాలను అందించాలని కమిటీ నోటీస్‌లోపేర్కొంది. అలాగే కేఆర్ఎంబీ, జీఆర్ఎంబీ తమ వద్ద ఉన్న పూర్తి సమాచారాన్ని అంద జేయాలని సూచించింది. కేంద్ర జల సంఘం చైర్మెన్ అతుల్‌జైన్ నేతృత్వంలో ఏర్పాటైన కమిటీలో కృష్ణా, గోదావరి బోర్డుల చైర్మెన్లు, (ఎన్‌డబ్ల్యూడీఏ) చీఫ్ ఇంజినీర్, (సీడబ్ల్యూసీ) చీఫ్ ఇంజినీర్ రెండు రాష్ట్రాల నుంచి నలుగురు ఉన్నతాధికారులకు అవకాశం కల్పించారు. పోలవరం నల్లమలసాగర్‌తో పాటు కృష్ణా నది వాటాల విషయంలో ఏర్పడ్డ వివాదాలను పరిష్కరించడానికి 2025 జూన్‌లో కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ తెలంగాణ, ఏపీతో పాటు కేంద్ర ప్రభుత్వ అధికారులతో ఓ కమిటీ ఏర్పాటు చేసింది. అయితే వివాదాలు పరిష్కారం కాక పోగా, ఇంకా పెరిగాయి. దానికి తోడు బ్రిజేష్‌కుమార్ నేతృత్వంలో ఏర్పాటైన కృష్ణా వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యూనల్-2 కృష్ణా జలాల పంపకాల పున: పంపకంపై సెక్షన్ 3 ప్రకారం ఇవ్వాల్సిన అవార్డు గడువును కేంద్రం 31 జులై 2026 వరకు పెం చింది. అలాగే గోదావరి వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యూనల్‌గతంలో ఇచ్చిన అవార్డులో రాష్ట్రాల మధ్య స్పష్ట మైన పంపకాలపై నిర్ణయం తీసుకోలేదు. ఈ క్రమంలో తాజాగా వేసిన ఉన్నత స్థాయి కమిటీ సమావేశంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# ఖాళీల భర్తీకి కట్టుబడున్నాం




- యువతను ప్రపంచంతో పోటీ పడేలా తీర్చిదిద్దుతాం
- ఉద్యోగం కేవలం ఉపాధి కాదు ఒక భావోద్వేగం
- పరిపాలనలో ప్రక్షాళనకు ఉద్యోగుల సహకారం అవసరం
- తెలంగాణను ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దాలి
- పేదలను తల్లిదండ్రుల్లా చూడాలి
- రెండేళ్లలో 70 వేల ఉద్యోగాల భర్తీ
- నాణ్యమైన విద్యే జీవిత మార్పునకు మార్గం
- 2047 నాటికి ట్రిలియన్ డాలర్ లక్ష్యంతో ముందడుగు
- సీఎం రేవంత్ రెడ్డి
- గ్రూప్-3 ఎంపికైన 1,370 మందికి నియామక పత్రాలు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాబోయే రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్న అన్ని ఖాళీలను భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేటు రంగంలోనూ ప్రపంచంతో పోటీ పడే విధంగా యువతను తీర్చిదిద్దే కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతుందని ఆయన తెలిపారు.ప్రజా పాలనలో భాగంగా 'కొలువుల పండుగ' కార్యక్రమంలో హైదరాబాద్ శిల్పకళా వేదికలో ఏర్పాటు చేసిన వేడుకలో 25 శాఖలకు సంబంధించిన గ్రూప్-3లో ఎంపికైన 1,370 మంది అభ్యర్థులకు నియామక పత్రాలను ముఖ్యమంత్రి లాంఛనంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్తగా ఎంపికైన ఉద్యోగులు రాష్ట్ర పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

పరిపాలనలో ప్రక్షాళన జరగాలంటే కొత్తగా చేరిన ఉద్యోగులు చిత్తశుద్ధితో పనిచేయాలని, దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు అంకితభావంతో పనిచేయాలన్నారు. 30 నుంచి 35 ఏళ్ల పాటు తలవంచకుండా తెలంగాణ కోసం పనిచేశానని గర్వంగా చెప్పుకునేలా సేవలందించాలని సూచించారు. ఉద్యోగం ఒక భావోద్వేగమని, ఈ భావోద్వేగమే తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో ఉద్యోగులను భాగస్వాములను చేస్తుందన్నారు. 4 కోట్ల మంది ప్రజల కోసం పనిచేసే బాధ్యత ప్రభుత్వ ఉద్యోగులపై ఉందని గుర్తు చేశారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఉద్యోగ నియామకాలు జరుగుతాయని ప్రజలు ఆశించినప్పటికీ, 2014 నుంచి 2024 వరకు పదేళ్ల పాటు సరైన నియామకాలు జరగలేదని విమర్శించారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో 14 ఏళ్ల పాటు గ్రూప్--క్ష్మీ నియామకాలు చేపట్టలేదని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలోనే 60 వేల ఉద్యోగాలు భర్తీ చేసి దేశంలోనే ఘనత సాధించామని, గడిచిన రెండేళ్లలో మొత్తం 70 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని సీఎం తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత టీఎస్‌పీఎస్సీని పూర్తిగా ప్రక్షాళన చేసి, గ్రూప్-1,2,3,4 నియామకాలను యజ్ఞంలా నిర్వహించామని అన్నారు.

రాష్ట్రంలో విద్య అన్ని ప్రాంతాలకు విస్తరించినప్పటికీ నాణ్యమైన విద్య అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో 16.5 లక్షల మంది విద్యార్థులు ఉండగా, ప్రైవేటు పాఠశాలల్లో 33 లక్షల మంది చదువుతున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 1.20 లక్షల మంది అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ ఈ పరిస్థితి ఎందుకు ఏర్పడిందో ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. నాణ్యమైన విద్య, అవసరమైన నైపుణ్యాలు లేకపోవడం వల్ల అంతర్జాతీయ అవకాశాలను యువత అందిపుచ్చుకోలేకపోతున్నారని చెప్పారు. పేదలకు భూములు ఇవ్వలేని పరిస్థితుల్లో విద్యే జీవితాన్ని మార్చే ఆయుధమని, చదువే గౌరవాన్ని ఇస్తుందని సీఎం స్పష్టం చేశారు. మిగితా 4వ పేజీలో

## ఆదిలాబాద్ అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక

- బాసరలో యూనివర్సిటీ, నిర్మల్‌లో ఏటీసీ, తుమ్మిడిహెట్టిలో ప్రాణహిత--చేవెళ్ల ప్రాజెక్టు
- అతిపెద్ద పారిశ్రామిక వాడ ఏర్పాటు
- 10 వేల ఎకరాలతో పారిశ్రామిక హబ్ అభివృద్ధి
- ఫిబ్రవరిలో ఉమ్మడి జిల్లా సమీక్ష సమావేశాలు
- నాగోబా జాతరకు రూ.22 కోట్లు మంజూరు
- మేడారం అభివృద్ధికి రూ.300 కోట్ల వ్యయం
- సీఎం రేవంత్ రెడ్డి
- రూ.386.46 కోట్ల పనులకు శంకుస్థాపన




బలగం టీవి, ఆదిలాబాద్

తెలంగాణలో అత్యంత వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బాసర ఐఐఐటీలో విశ్వవిద్యాలయం ఏర్పాటు, నిర్మల్‌లో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ), ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు తాగు, సాగునీటి అవసరాల కోసం తుమ్మిడిహెట్టిలో ప్రాణహిత--చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణం, జిల్లాలో అతిపెద్ద పారిశ్రామిక కేంద్రం ఏర్పాటు వంటి కీలక అభివృద్ధి నిర్ణయాలను సీఎం ప్రకటించారు.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రూ.386.46 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మంత్రులు, ప్రజాప్రతినిధులతో మిగితా 4వ పేజీలో

## విప్లవంగా స్టార్టప్ ఇండియా

- ప్రభుత్వ పథకం కాదు.. జాతీయ ఉద్యమం
- కోటి కలలతో దేశాన్ని ముందుకు నడిపిస్తున్న యువ వ్యాపారవేత్తలు
- ప్రధాని మోదీ



బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

స్టార్టప్ ఇండియా పదేళ్ల ప్రయాణాన్ని కోట్లాది యువ కలలు, సృజనాత్మక ఆలోచనలతో రూపుదిద్దుకున్న విప్లవంగా ప్రధాని నరేంద్ర మోదీ అభివర్ణించారు. జాతీయ స్టార్టప్ డే సందర్భంగా న్యూఢిల్లీలోని భారత్ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్టార్టప్ వ్యవస్థాపకులు, ఆవిష్కర్తలు, యువ పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.స్టార్టప్ ఇండియా ఒక ప్రభుత్వ పథకంగా ప్రారంభమై నేడు నూతన భారతాన్ని నిర్వచించే జాతీయ ఉద్యమంగా మారిందని ప్రధాని పేర్కొన్నారు. గత పదేళ్లలో భారత్ ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా ఎదిగిందని తెలిపారు.

**500 నుంచి 2 లక్షలకు పైగా స్టార్టప్స్**

2014లో దేశంలో 500కు కూడా తక్కువ స్టార్టప్స్ ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 2 లక్షలకు పైగా పెరిగిందని ప్రధాని వెల్లడించారు. యూనికార్న్ కంపెనీలు నాలుగు నుంచి దాదాపు 125కు చేరాయని, భారతీయ స్టార్టప్స్ ఐపీఓలు తీసుకురావడం, ఉద్యోగాల సృష్టి, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం గర్వకారణమన్నారు.

2025లో ఒక్క సంవత్సరంలోనే సుమారు 44 వేల స్టార్టప్స్ నమోదు కావడం స్టార్టప్ రంగంలో వేగంగా జరుగుతున్న వృద్ధికి నిదర్శనమని చెప్పారు.

**నిజ జీవిత సమస్యలకు పరిష్కారాలు**

వ్యవసాయం, ఫిన్‌టెక్, మొబిలిటీ, ఆరోగ్యం, సస్టైనబిలిటీ వంటి రంగాల్లో యువత ఆవిష్కరణలు దేశ భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నాయని ప్రధాని తెలిపారు. స్టార్టప్ ఇండియా యువతకు ఆవిష్కరణల కోసం ఆకాశాన్ని విప్పిందని, నేటి యువ పారిశ్రామికవేత్తలే రేపటి కేస్ స్టడీలుగా మారతారని అన్నారు.

**ఉద్యోగార్థుల నుంచి ఉద్యోగ సృష్టికర్తలుగా యువత: గోయల్**

ఈ సందర్భంగా కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ, పదేళ్ల క్రితం ప్రధాని యువతను ఉద్యోగాలు కోరుకునేవారిగా కాకుండా ఉద్యోగాలు సృష్టించే వారిగా మారాలని పిలుపునిచ్చారని గుర్తు చేశారు. ఆ దృక్పథం నేడు సాకారమవుతోందన్నారు. స్టార్టప్ ఇండియా ప్రారంభమైన 2016లో దేశంలో కేవలం 400 స్టార్టప్స్ మాత్రమే ఉండగా, నేడు డీపీఐఐటీ వద్ద 2 లక్షలకు పైగా స్టార్టప్స్ నమోదు అయ్యాయని తెలిపారు. వీటి ద్వారా సుమారు 21 లక్షల ఉద్యోగాలు సృష్టించబడ్డాయని పేర్కొన్నారు.

**డీప్‌టెక్ నుంచి అంతరిక్ష రంగం వరకు**

ప్రస్తుతం స్టార్టప్స్ 50కి పైగా రంగాల్లో పనిచేస్తున్నాయని గోయల్ తెలిపారు. డీప్‌టెక్, ఏఐ, మెషిన్ లెర్నింగ్, క్వాంటమ్ కంప్యూటింగ్, అగ్రి టెక్, స్పేస్ టెక్, డ్రోన్, ఏరోస్పేస్ వంటి రంగాల్లో భారతీయ స్టార్టప్స్ విశేష పురోగతి సాధిస్తున్నాయని చెప్పారు. స్టార్టప్స్‌కు మద్దతుగా 2016లో రూ.10 వేల కోట్ల ఫండ్ ఆఫ్ ఫండ్స్ ఏర్పాటు చేశామని, దాని విజయంతో మరో రూ.10 వేల కోట్ల నిధులు మంజూరు చేశామని మంత్రి తెలిపారు. అదనంగా పరిశోధన, ఆవిష్కరణల కోసం రూ.లక్ష కోట్ల ప్రత్యేక నిధిని ప్రధాని ప్రకటించారని గుర్తు చేశారు. దేశంలోని టియర్--2, టియర్--3 నగరాల నుంచి దాదాపు 50 శాతం స్టార్టప్స్ ఉద్భవించడం స్టార్టప్ ఉద్యమం గ్రామీణ, పల్లె ప్రాంతాలకు విస్తరించిందని సూచిస్తోందన్నారు. ఈశాన్య రాష్ట్రాలు, దక్షిణ భారతం స్టార్టప్ రంగంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు.

స్టార్టప్ ఇండియా పదేళ్ల ప్రయాణం స్పష్టమైన విధానాలు, స్థిరమైన అమలు, పెరుగుతున్న యువ విశ్వాసానికి నిదర్శనమని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. స్టార్టప్స్ దేశ ఆర్థిక బలం, ఆత్మనిర్భరతకు ప్రధాన స్తంభాలుగా నిలుస్తున్నాయని తెలిపింది. ఈ సందర్భంగా జాతీయ స్టార్టప్ అవార్డులు, రాష్ట్రాల స్టార్టప్ ర్యాంకింగ్ ఫలితాలను ప్రకటించారు.

## మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో మహాయుతి విజయఢంకా

- 29 కార్పొరేషన్లలో 25 చోట్ల అధికార కూటమి గెలుపు
- ముంబయి కార్పొరేషన్ కూడా మహాయుతి ఖాతాలోకి

బలగం టీవి, ముంబై

మహారాష్ట్ర మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో అధికార మహాయుతి కూటమి ఘనవిజయం సాధించింది. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన 29 మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని మహాయుతి కూటమి 25 చోట్ల గెలుపొందింది. థాక్రే కుటుంబానికి కంచుకోటగా భావించే ముంబయి నగరాన్నీ మహాయుతి కైవసం చేసుకోవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

**ముంబయిలో మహాయుతికి స్పష్టమైన ఆధిక్యం**

దేశంలోనే సంపన్న మున్సిపల్ సంస్థ అయిన ముంబయి మున్సిపల్ కార్పొరేషన్‌లోని మొత్తం 227 వార్డులకుగానూ బీజేపీ 84 సీట్లు, శివసేన (షిండే) 26 సీట్లు గెలుచుకున్నాయి. శివసేన (ఉద్ధవ్) 74 సీట్లకే పరిమితమైంది. మ్యాజిక్ ఫిగర్ 114కి మహాయుతి కూటమి కేవలం నాలుగు సీట్ల దూరంలో (110 సీట్లు) నిలిచింది. ఈ గణాంకాలు శుక్రవారం రాత్రి 7.30 గంటల సమయానికి వచ్చిన ఫలితాల ఆధారంగా ఉన్నాయి.

**రాష్ట్రవ్యాప్తంగా మహాయుతి హవా**

29 మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలోని మొత్తం 2,869 వార్డులకుగానూ 1,700కు పైగా వార్డుల్లో మహాయుతి కూటమి ఆధిక్యంలో కొనసాగుతోంది. అంటే సగానికి మించిన స్థానాల్లో అధికార కూటమి స్పష్టమైన ఆధిపత్యం కనబరుస్తోంది.

**ఏ పార్టీకి ఎన్ని సీట్లు?**

బీజేపీ -- 1,388 సీట్లు
శివసేన (షిండే) -- 364 సీట్లు
ఎన్‌సీపీ (అజిత్) -- 150 సీట్లు
కాంగ్రెస్ -- 306 సీట్లు
శివసేన (ఉద్ధవ్) -- 166 సీట్లు

అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని మజ్లిస్ పార్టీ సైతం దాదాపు 94 సీట్లలో ఆధిక్యంలో కొనసాగడం గమనార్హం.

## అట్టహాసంగా హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ షురూ..



- లాంఛనంగా ప్రారంభించి.. విహరించిన మంత్రి జూపల్లి..
- గగనతలంలో మంత్రి జూపల్లి సాహస యాత్ర
- సుమారు గంటన్నర పాటు 13 కిలోమీటర్లు విహరించిన మంత్రి జూపల్లి

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

చారిత్రక గోల్కొండ కోట సమీపంలోని గోల్ఫ్ క్లబ్ వేదికగా హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ అట్టహాసంగా ప్రారంభమైంది. పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ వేడుకలకు శ్రీకారం చుట్టారు. ప్రారంభోత్సవం అనంతరం మంత్రి స్వయంగా హాట్ ఎయిర్ బెలూన్‌లో విహరించి సందడి చేశారు. ఆకాశ మార్గంలో సుమారు గంటన్నర సేపు 13 కిలోమీటర్లు విహరించారు. హైదరాబాద్ గోల్కొండ కోట సమీపంలోని గోల్ఫ్ క్లబ్ నుంచి ప్రారంభమైన హాట్ ఎయిర్ బలూన్ అప్పోజి గూడ శివారులో దిగింది.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.... తెలంగాణ పర్యాటక రంగంలో ఇదొక కొత్త అధ్యాయమని అభివర్ణించారు. వినూత్న ఆలోచనలకు తెలంగాణ వేదిక అని చాటిచెప్పడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ఒకవైపు 'ఇంటర్నేషనల్ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ల ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం మరియు ఆతిథ్యాన్ని చాటుతుండగా, మరోవైపు 'హాట్ ఎయిర్ బెలూన్, డ్రోన్ ఫెస్టివల్ల ద్వారా ఆధునిక సాంకేతికతను, భవిష్యత్తు దృక్పథాన్ని ప్రపంచానికి పరిచయం మిగితా 4వ పేజీలో



## ఆ ఇద్దరూ పార్టీ మారలేదు

- మరో ఇద్దరికి క్లీన్ చీట్ ఇచ్చిన స్పీకర్
- మరో ముగ్గురిపై కొనసాగుతున్న విచారణ

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఫిరాయింపు ఎమ్మెల్యేల్లో మరో ఇద్దరికి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ క్లీన్‌చిట్ ఇచ్చారు. సుప్రీంకోర్టులో విచారణ జరగనున్న నేపథ్యంలో ఒకరోజు ముందే తీర్పు ప్రకటించారు. ఇంకా ముగ్గురిపై విచారణ కొనసాగుతున్నది. మొత్తం పది మంది శాసన సభ్యులకుగాను స్పీకర్ ఇప్పటికే ఏడుగురికి అనర్హ్వ త విషయంలో క్లీన్‌చిట్ ఇచ్చినట్టయిం ది. పార్టీ మారినట్టు ఏలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేశారు. వారంతా బీఆర్ఎస్‌లో కొనసాగుతున్నట్టు తీర్పులో పేర్కొన్నారు. ఈ ఫిరాయింపుల వ్యవహార ం తెలంగాణలో రాజకీయంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. సంక్రాంతి పండుగ రోజైన గురువారం పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాలే యాదయ్యపై బీఆర్ఎస్ అనర్హత పిటిషన్లను స్పీకర్ తిరస్కరించారు. పార్టీ మారినట్టు ఆధారాల్లేవనీ, వీరిద్దరిని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలుగానే గుర్తిస్తున్నట్టు ఆయన తేల్చారు. అలాగే ఇంతకుముందు ఐదుగురిపై కూడా స్పీకర్ ఇలాంటి నిర్ణయమే తీసుకున్న విషయం తెలిసిందే.

కాగా 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున గెలిచిన 10 మంది ఎమ్మెల్యేల్లో దానం నాగేందర్, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాలే యాదయ్య తదితరులు 2024 లో కాంగ్రెస్‌లో చేరినట్టు బీఆర్ఎస్ ఆరోపించిన విషయం విదితమే. అంతేగాక వీరిపై బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, పాడి కౌశిక్‌రెడ్డి తదితరులు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల పై అనర్హత వేటు వేయాలని కోరారు. అయితే స్పీకర్ నిర్ణయం తీసుకోవడంలో ఆలస్యం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ నేతలు హైకోర్టు, ఆ తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ అంశంపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ఫిరాయింపు ఎమ్మెల్యేలపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌ను ఆదేశించింది. తాజాగా శుక్రవారం మరో రెండు వారాల సమయం ఇస్తూ సుప్రీం ఆదేశాలిచ్చింది.

## ఇదే చివరి అవకాశం

- పిర్యాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ నిర్ణయం తీసుకోవాలి
- సుప్రీంకోర్టు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను ఉద్దేశించి సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో తగినంత సమయం ఇచ్చినా ఇంకా తుది నిర్ణయం తీసుకోకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇదే చివరి అవకాశమని, ఇకనైనా నిర్ణయం తీసుకోకపోతే పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టంగా హెచ్చరించింది. ఫిరాయింపుల ఆరోపణలతో బీఆర్ఎస్ పార్టీ దాఖలు చేసిన పిటిషన్లను జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్‌ల ధర్మాసనం శుక్రవారం విచారించింది. ఈ సందర్భంగా స్పీకర్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సంఘ్వీ వాదనలు వినిపించారు. ఇప్పటికే ఏడుగురు ఎమ్మెల్యేలపై స్పీకర్ నిర్ణయం తీసుకున్నారని సంఘ్వీ కోర్టుకు తెలిపారు. మిగిలిన ముగ్గురు ఎమ్మెల్యేల విషయంలో మిగితా 4వ పేజీలో

## రాజన్న ఆలయ అభివృద్ధికి భారీ నిధులు

- తుది దశలో మేడారం గద్దెల పునర్నిర్మాణ పనులు
- భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా ప్రజా ప్రభుత్వ చర్యలు



బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం విశేష ప్రాధాన్యం ఇస్తూ భారీ నిధులు మంజూరు చేస్తున్నదని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి పారుదల, మహిళా--శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. వేములవాడ పట్టణంలోని శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో మంత్రి సీతక్క శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి సీతక్క ఆలయానికి రాగా, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గీతే పుష్పగుచ్ఛం అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు, అధికారులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ముందుగా కోడె మొక్కు చెల్లించుకొని, భీమేశ్వర స్వామి వారికి మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. గాయత్రి మాతను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, అధికారులు మంత్రికి స్వామి వారి ప్రసాదం అందజేసి, వేదోక్త ఆశీర్వచనం అందజేశారు. అనంతరంవేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ జంక్షన్ అభివృద్ధి పనులకు రూ.కోటి నిధులతో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్‌లతో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ భక్తుల విశ్వాసాలు, నమ్మకాలకు అనుగుణంగా వేములవాడ రాజన్న ఆలయ విస్తరణకు రెండు బడ్జెట్లలో కలిపి రూ.150 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఆలయ విస్తరణ పనులకు శ్రీకారం చుట్టామని, పూర్తి అయిన అనంతరం సీఎం స్వయంగా దర్శనానికి వస్తారని అన్నారు.

స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వేములవాడ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తూ వివిధ శాఖల నుంచి నిధులు తీసుకువస్తున్నారని, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సహకారంతో రాజన్న ఆలయ అభివృద్ధికి వేగం పెరిగిందని అన్నారు.అలాగే మేడారంలోని సమ్మక్క--సారలమ్మ గద్దెల పునర్నిర్మాణానికి రూ.200 కోట్లకు పైగా నిధులు మంజూరు చేశామని, వందల ఏళ్ల చరిత్ర నిలిచేలా నిర్మాణాలు చేపడుతున్నామని .,మేడారం జాతరకు ముందు రాజన్నను దర్శించుకోవడం ఆనవాయితీగా కొనసాగుతుందని అన్నారు.మహిళా సంఘాల సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, జిల్లా కేంద్రంలో రూ.5 కోట్లతో ఇందిరా మహిళా శక్తి మిగితా 2వ పేజీలో

## చెరువుల రక్షణకు సర్కార్ కీలక నిర్ణయం

- భూములు కోల్పోయే వారికి భారీగా టిడిఆర్‌లు
- 10 అంతస్తుల పైబడి భవనాలకు 10 శాతం టిడిఆర్ తప్పనిసరి

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని చెరువులు, నాలాలు, నదులను ఆక్రమణల నుంచి కాపాడేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నీటి వనరుల పరిరక్షణలో భాగంగా స్వచ్ఛందంగా భూములు అప్పగించే భూస్వాములకు ప్రయోజనాలు చేకూర్చేలా 'బదిలీ చేయగల అభివృద్ధి హక్కులు' (టీడీఆర్) నిబంధనలను ప్రభుత్వం భారీగా సవరించింది. ఈ నిర్ణయం ద్వారా ఒకవైపు జలవనరులకు రక్షణ కలుగుతుండగా, మరోవైపు భూములు కోల్పోయే పట్టాదారులకు న్యాయం జరిగే అవకాశం ఏర్పడింది.

**కోర్ అర్బన్ రీజియన్‌లో భారీ టిడిఆర్**

చెరువులు, నాలాల పరిధిలో ఉండి నిర్మాణాలకు అవకాశం లేక నష్టపోతున్న భూముల యజమానులకు ఊరటనిస్తూ, కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో భూములు కోల్పోయే వారికి గరిష్టంగా 400 శాతం వరకు టిడిఆర్ మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిబంధనలు హెచ్‌ఎండిఏ, జీహెచ్ఎంసీ, హైడ్రా, మూసీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వంటి సంస్థలు చేపట్టే ప్రాజెక్టులకు వర్తించనున్నాయి.

**10 అంతస్తుల పైబడి భవనాలకు కొత్త నిబంధన**

ఇకపై 10 అంతస్తులకుపైగా నిర్మించే భవనాల్లో మొత్తం విస్తీర్ణంలో కనీసం 10 శాతం టిడిఆర్ ద్వారానే భర్తీ చేయాల్సి ఉంటుంది. ఈ నిబంధనను తప్పనిసరిగా అమలు చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

**ఏ భూమికి ఎంత టిడిఆర్?**

ఎంఎఫ్ఎల్ భూములు(నీటి మట్టం పరిధిలో)-200 శాతం
జోన్ భూములు (చెరువులు, నదుల పక్కన) -300 శాతం
విస్తరణ ప్రాంతాలు (ప్రైవేటు భూములు) - 400 శాతం
అవసరాల కోసం (బఫర్ జోన్ వెలుపల) - 400 శాతం

అదేవిధంగా రహదారి వెడల్పును బట్టి భవన నిర్మాణంలో సెట్‌బ్యాక్‌లపై కూడా రాయితీలు పొందే అవకాశం కల్పించారు.

**టీడీఆర్ జారీకి కఠిన నిబంధనలు**

టీడీఆర్ జారీ ప్రక్రియలో అక్రమాలకు తావులేకుండా ప్రభుత్వం కఠిన మార్గదర్శకాలను అమల్లోకి తీసుకొచ్చింది.

అధికారుల క్లియరెన్స్ తప్పనిసరి: ఇరిగేషన్ విభాగం (ఈఈ స్థాయి) మరియు రెవెన్యూ విభాగం (అదనపు కలెక్టర్ స్థాయి) నుంచి అనుమతులు వచ్చిన తర్వాతే టిడిఆర్ మంజూరు చేస్తారు.

వివాదాస్పద భూములు: భూమి టైటిల్ వివాదాల్లో ఉంటే, ఆ భూములకు సంబంధించిన టిడిఆర్ హక్కులను 'టిడిఆర్ బ్యాంక్'లో భద్రపరుస్తారు. కోర్టు వివాదాలు పూర్తైన అనంతరం మాత్రమే యజమానికి అప్పగిస్తారు.

ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో చెరువులు, నాలాలు, నదులు ఆక్రమణల నుంచి రక్షణ పొందడమే కాకుండా, అభివృద్ధి పేరుతో భూములు కోల్పోయే యజమానులకు సముచిత న్యాయం జరిగే అవకాశముందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

## ధరణి-భూ భారతి భూస్కాం గుట్టు రట్టు

- జనగాం, యాదాద్రి జిల్లాల్లో రూ.3.90 కోట్ల ప్రభుత్వానికి నష్టం
- 15 మంది అరెస్టు 9 మంది పరారీలో
- రూ.63 లక్షల నగదు, ఆస్తి పత్రాలు, కార్లు, కంప్యూటర్లు స్వాధీనం



వివరాలు 4వ పేజీలో

# రుద్రంగి ముఖచిత్రం మారబోతోంది..

- **నూతన ప్రభుత్వ కార్యాలయాల కోసం ఇంటిగ్రేటెడ్ భవనం నిర్మిస్తాం**
- **ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**



**బలగం టీవీ, రుద్రంగి రాజన్న సిరిసిల్ల:**

రుద్రంగిని అన్ని మౌలిక వసతులతో కూడిన మోడల్ గ్రామంగా తీర్చిదిద్దుతామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హామీ ఇచ్చారు. రుద్రంగి మండల కేంద్రంలో సర్వ శిక్ష అభియాన్ నిధులు రూ. 48.60 లక్షలతో నిర్మించిన మండల రిసోర్స్ సెంటర్ (ఎంఆర్సీ) భవనాన్ని శుక్రవారం ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్‌తో కలిసి ప్రారంభించారు.అనంతరం గ్రామ పంచాయతీ భవనం ఆవరణలో 21 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, రుద్రంగిలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలన్నింటిని ఒకే చోట ఏర్పాటు చేయడానికి ఇంటిగ్రేటెడ్ ప్రభుత్వ భవనాన్ని త్వరలోనే నిర్మిస్తామని, స్థానిక యువత కోరిక మేరకు క్రీడల కోసం మైదానం ఏర్పాటు చేస్తామని అన్నారు.

జిల్లాలోని యువతకు నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన లక్ష్యంగా రూ. 42 కోట్లతో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (టీజు) మంజూరైందని, టెండర్ ప్రక్రియ పూర్తైందని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని,టాటా సంస్థ సహకారంతో ఈ కేంద్రంలో ఆరు రకాల కోర్సులు అందుబాటులోకి వస్తాయని అన్నారు.

మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో గోదాం నిర్మాణానికి స్థలం గుర్తించామని, పనులు త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. వేములవాడ నియోజకవర్గంలో రుద్రంగి రెండవ అతిపెద్ద గ్రామమని పేర్కొంటూ, విశాలమైన రహదారులు, మురుగు కాలువలు నిర్మిస్తున్నామని అన్నారు .

సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తున్నారని,కలికోట--సూరమ్మ ప్రాజెక్టు నిర్వాసితులకు త్వరలో పరిహారం పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ అభివృద్ధి పనుల కోసం మాత్రమే ప్రభుత్వ భూములు వినియోగిస్తామని, అర్హులైన నిరుపేదల భూములను ఎట్టి పరిస్థితుల్లో తీసుకోమని అన్నారు.ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి సాగునీటి విడుదల, 132/33 సబ్‌స్టేషన్ పనుల ప్రారంభం, విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇప్పటికే రూ. 5 కోట్లకు పైగా నిధులతో సీసీ రోడ్లు నిర్మించామని అన్నారు. ఇందిరా చౌక్ నుంచి కుక్కల గండి వరకు రూ. 4.57 కోట్లతో బీటీ రోడ్డు, రుద్రంగి నుంచి దసరా నాయక్ తండా వరకు రూ. 2.50 కోట్లతో హై లెవల్ బ్రిడ్జి, సీసీ రోడ్డు పనులు త్వరలో ప్రారంభమవుతాయని అన్నారు.50 ఏళ్లుగా గ్రామస్తులు ఎదురుచూస్తున్న ప్రభుత్వ ఆసుపత్రికి రూ. 1.50 కోట్లు మంజూరు చేసి 30 పడకల ఆసుపత్రి నిర్మాణం చేపట్టామని, రుద్రంగి--రామకృష్ణపూర్ పల్లె మధ్య రూ. 62 లక్షలతో కల్వర్టు నిర్మాణం పూర్తి చేశామని, అంబేద్కర్ చౌరస్తా నుంచి ఇందిరా చౌక్ వరకు రూ. 1.50 కోట్లతో రింగ్ రోడ్డు, ప్రధాన రహదారిపై రూ. 2 కోట్లతో డ్రైనేజీ నిర్మాణం, రూ. 2.50 కోట్లతో నూతన పోలీస్ స్టేషన్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని అన్నారు. రైతులు అంగీకరిస్తే అచ్చయ్య కుంట, నగరాం చెరువులను నీటితో నింపేందుకు నష్టపరిహారం చెల్లిస్తామని స్పష్టం చేశారు. ఎంఆర్సీ భవనం విద్యాభివృద్ధికి ఉపయోగకరమని అన్నారు.

ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. నూతనంగా ప్రారంభించిన ఎంఆర్సీ భవనం ద్వారా విద్యాభివృద్ధి సమావేశాలు, ఉపాధ్యాయ--తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల కోసం ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తామని, ప్రజలకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ నారాయణ, ఉప సర్పంచ్ మాడిశెట్టి అభిలాష్, మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతి, వేములవాడ ఆర్డీఓ రాధాబాయి, డీఈఓ వినోద్ కుమార్, టీజీ ఈడబ్ల్యూఐడీసీ ఈఈ అశోక్ కుమార్, డీఈ సత్యనారాయణ, తహసిల్దార్ పుష్పలత, ఎంపీడీఓ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన సోమారంపేట విద్యార్థి

- **ఘనంగా సత్కరించిన పోరెడ్డి సుమంత్ రెడ్డి, కాచం సురేందర్ రెడ్డి, భాను**
- **విద్యార్థులకు అండగా ఉంటామని హామీ**

**బలగం టీవీ, ఇల్లంతకుంట:**

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ సోమారం పేట గ్రామానికి చెందిన విద్యార్థిని నిత్య రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక య్యారు. ఈ సందర్భంగా గురువారం ఆమెను గ్రామానికి చెందిన పోరెడ్డి సుమంత్ రెడ్డి, కాచం సురేందర్ రెడ్డి, భాను శాలువాతో ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు. కబడ్డీ కి సంబంధించిన కిట్ నిత్యకి అందజేస్తామని హామీ ఇచ్చారు.

సోమారంపేట గ్రామానికి చెందిన మూడపెల్లి సంపత్ కుమార్తె నిత్య, రహీంఖాన్ పేట మోడల్ స్కూల్‌లో పదవ తరగతి చదువుతోంది. ఇటీవల జరిగిన క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా పోరెడ్డి సుమంత్ రెడ్డి, కాచం సురేందర్ రెడ్డి, భాను మాట్లాడుతూ.. గ్రామీణ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. ప్రతిభ గల విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగడానికి, క్రీడల్లో మరియు చదువుల్లో రాణించడానికి తమ వంతు అవసరమైన సహాయ సహకారాలను ఎల్లప్పుడూ అందిస్తామని వారు తెలిపారు.



## మాదిగ జాగృతి సంఘం ఆధ్వర్యంలో నూతన ప్రజా ప్రతినిధులకు సన్మానం..

- **గ్రామాన్ని పాలించే అధికారం రాజ్యాంగం ఇచ్చింది : రాష్ట్ర ఫుడ్ కమిషన్ నెంబర్ ఓరుగంటి ఆనంద్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మాదిగ జాగృతి సంఘం ఆధ్వర్యంలో పెద్దూరు వద్ద గల జీకే ఫంక్షన్ హాల్ లో సిరిసిల్ల జిల్లా స్థాయిలో మాదిగ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డ్ మెంబర్ల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర ఫుడ్ కమిషన్ నెంబర్ ఓరుగంటి ఆనంద్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వికేంద్రీకరణకు కేంద్ర బిందువు గ్రామపంచాయతీ ఎన్నికలు. గ్రామానికి దూరంగా ఉన్న అట్టడుగు కులాలు భారత రాజ్యాంగం ద్వారా గ్రామ ప్రజా ప్రతినిధులు కావడానికి అవకాశం ఏర్పడింది. కావున ఎంపికైన పాలకవర్గం బాధ్యులు గ్రామ బడుగు బలహీన వర్గాల సామాజిక, ఆర్థిక ప్రగతిలో కీలకపాత్ర పోషించాలన్నారు. అంబేద్కర్ పూలే ఆలోచన విధానంతో సమాజాన్ని పరివర్తన చేయాలన్నారు. ఈ దేశాన్ని పాలించిన ఆది జాంబవంతుని వారసులుగా మాదిగ జాతి అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలన్నారు. యువతను సన్మార్గంలో పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాదిగ జాగృతి సంఘ బాధ్యులు మంద బాబు, కేసు గాని దేవయ్య, పరమేశ్వరి, కమటం మల్లయ్య, సంపతి రమేష్, చుంచు మహేష్, శేఖర్, రామస్వామి, భీమ్ ప్రకాష్ , భీమ్ కీర్తన మహారాణి, అనిల్, బాబు, అరుణ్,వేణు,శ్రీధర్ రాజశేఖర్ మరియు గ్రామాల్లో ఎంపికైన సర్పంచి ఉప సర్పంచ్ వార్డ్ మెంబర్లు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ జబీన్ హత్య కేసును ఛేదించిన పోలీసులు

- **అప్పుగా ఇచ్చిన డబ్బులు తిరిగి అడిగినందుకే ఘోరం..**
- **ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**




**బలగం టీవీ, ఆదిలాబాద్**

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కలకలం రేపిన జబీన్ అదృశ్యం కేసు విషాదాంతమైంది. కేవలం డబ్బుల కోసమే ఆమెను దారుణంగా హత్య చేసినట్లు ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఆయన మీడియాకు వివరించారు.

ఆదిలాబాద్‌లోని పిట్టలవాడకు చెందిన జబీన్ గత నెలలో అకస్మాత్తుగా అదృశ్యమయ్యారు. దీనిపై కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో భాగంగా ఇంద్రవెల్లికి చెందిన ఫరూక్ అనే వ్యక్తిపై పోలీసులకు అనుమానం కలిగింది. నిందితుడు ఫరూక్ గతంలో జబీన్ వద్ద కొంత నగదును అప్పుగా తీసుకున్నాడు. ఆ డబ్బును తిరిగి ఇవ్వాలని జబీన్ గత కొంతకాలంగా అతడిని ఒత్తిడి చేస్తోంది. అప్పు తీర్చడం ఇష్టం లేని ఫరూక్, ఆమెను అడ్డు తొలగించుకోవాలని పథకం వేశాడు. ఈ క్రమంలో తన స్నేహితుడితో కలిసి జబీన్‌ను దారుణంగా హత్య చేశాడు. ప్రధాన నిందితుడు ఫరూక్ తో పాటు అతడికి సహకరించిన స్నేహితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో సాక్ష్యాధారాలను పక్కాగా సేకరించామని, నిందితులకు త్వరగా శిక్ష పడేలా ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలో చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. ఆర్థిక లావాదేవీల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, నేరాలకు పాల్పడితే ఎంతటి వారైనా వదిలేది లేదని ఎస్పీ స్పష్టం చేశారు.

# ఇల్లంతకుంటలో ఘనంగా సంక్రాంతి వేడుకలు..

- **నృత్యాలతో అలరించిన డూడు బసవన్నలు**
- **ఉపసర్పంచ్ మూగు నాగరాజు శర్మ ఆధ్వర్యంలో వేడుకలు**

**బలగం టీవీ, ఇల్లంతకుంట:**

ఇల్లంతకుంట మండల కేంద్రంలోని పాత వాడలో ప్రముఖ పురోహితుడు, ఇల్లంతకుంట ఉప సర్పంచ్ మూగు నాగరాజు శర్మ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పాత వాడ కుటుంబ సభ్యులతో కలిసి నాగరాజు శర్మ సంక్రాంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా డూడు బసవన్నలతో నృత్యాలు చేయిస్తూ, అలరింప చేశారు. మన సంస్కృతి సాంప్రదాయాలను ప్రతి ఒక్కరు రక్షించుకోవాల్సిన బాధ్యత ఉందని, ఉప సర్పంచ్ నాగరాజు శర్మ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇల్లంతకుంట మండల ప్రజలకు, గ్రామ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో



పాత వాడ ప్రజలు పాల్గొన్నారు. అనంతరం డూడు బసవన్నలతో అలరింపజేసిన గంగిరెద్దు కళాకారులకు 11వేల ఆర్థిక సహాయంతో, పాటుగా వారికి అవసరమయ్యే బియ్యం, నిత్యవసర సరుకులు అందజేశారు.



## అనంతారంలో నూతన పాలకవర్గానికి ఘన సన్మానం..


- **శ్రీ దుర్గా భవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శాలువాలతో అభినందనలు..**

**బలగం టీవీ, ఇల్లంతకుంట:**

ఇల్లంతకుంట మండలంలోని అనంతారం గ్రామంలో శుక్రవారం శ్రీ దుర్గా భవాని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన గ్రామ పాలకవర్గానికి ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన సర్పంచ్ వొల్లల రజిత వెంకటేశం, ఉప సర్పంచ్ కదం జయంత్ లతో పాటు వార్డు సభ్యులను శాలువాలతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దుర్గా భవాని ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులు,యువత పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన పాలకవర్గానికి తమ మద్దతు తెలియజేశారు.గ్రామ అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పని చేయాలని ఈ సందర్భంగా పలువురు ఆకాంక్ష వ్యక్తం చేశారు.

# అనంతారంలో అరుదైన వింత

- వేపచెట్టు నుండి కారుతున్న కల్లు..!
- ఆసక్తి గా తిలకిస్తున్న గ్రామ యువత



**బలగం టీవీ, ఇల్లంతకుంట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతారం గ్రామంలో ఒక అరుదైన దృశ్యం స్థానికులను విస్మయానికి గురిచేస్తోంది. గ్రామంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ప్రాంగణంలో ఉన్న ఒక వేపచెట్టు నుండి తెల్లటి తాటి కల్లు లాంటి ద్రవం ధారగా కారుతోంది.

పండుగ పూట వేపచెట్టు నుండి ఇలా ద్రవం రావడం చూసి గ్రామస్తులు ఆశ్చర్యపోతున్నారు. ఈ వింతను చూసేందుకు చుట్టుపక్కల ప్రజలు, యువకులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. మరికొందరు ఇది బ్రహ్మం గారు తన కాలజ్ఞానంలో చెప్పిన వింతల్లో ఒకటిగా భావిస్తూ రకరకాలుగా చర్చించుకుంటున్నారు.

సాధారణంగా తాటి చెట్టు, ఈత చెట్టు నుండి కల్లు రావడం సహజం, కానీ వేపచెట్టు నుండి ఇలా తెల్లటి నురుగుతో కూడిన ద్రవం రావడం అరుదైన విషయమని యువకులు అంటున్నారు. పండుగ రోజున ఇలాంటి దృశ్యం కనిపించడంపై హర్షం వ్యక్తం చేస్తూ, ఈ వింతను తమ సెల్ ఫోన్లలో బంధిస్తున్నారు. ఏది ఏమైనా, ప్రకృతిలో జరిగే ఇటువంటి మార్పులు ఇప్పుడు అనంతారం గ్రామంలో హాట్ టాపిక్ గా మారాయి.



# కనుల పండుగగా స్వామి గోదాదేవి కల్యాణ మహోత్సవం

**బలగం టీవీ, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం విలాసాగర్ గ్రామ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఘనంగా నిర్వహించిన శ్రీ వేంకటేశ్వర స్వామి -- గోదాదేవి గోదా కల్యాణ మహోత్సవంలో గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో విలాసాగర్ గ్రామ సర్పంచ్ ఏనుగుల కనకయ్య, గ్రామ పాలకవర్గ సభ్యులు, గట్టుబూత్కూర్ సర్పంచ్ మరియు పాలకవర్గం, గర్షకుర్తి సర్పంచ్, అలాగే చిన్న ఆచంపెల్లి, పెద్ద ఆచంపెల్లి గ్రామాల పాలకవర్గాలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జర్నలిస్టుల అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం

- సీనియర్ జర్నలిస్ట్, అధ్యక్షులు, టీటీడబ్ల్యూజేఏ, ఐజేయూ నేషనల్ కౌన్సిల్ మెంబర్ తిరుపతి నాయక్ మాలోత్

**బలగం టీవీ, హైదరాబాద్**

మీడియా సంస్థకు చెందిన జర్నలిస్టులు దొంతు రమేష్, పరిపూర్ణ చారి, సుధీర్ లను అర్ధరాత్రి పోలీసులు అరెస్టు చేయడాన్ని టీటీడబ్ల్యూజేఏ, తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని సీనియర్ జర్నలిస్ట్, అధ్యక్షులు, టీటీడబ్ల్యూజేఏ, ఐజేయూ నేషనల్ కౌన్సిల్ మెంబర్ తిరుపతి నాయక్ మాలోత్ ఒక ప్రకటనలో తెలిపారు. ‘ జర్నలిస్టులు గానీ, ఆయా వార్తా సంస్థ గానీ నిరాధారమైన లేదా అసత్య వార్త కథనాలను ప్రసారం/ప్రచురిస్తే, ముందుగా సంబంధిత వారు ఖండన కోరుకోవచ్చు. అయినప్పటికీ స్పందించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చు. కానీ ఈ విధంగా ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, అర్ధరాత్రి సమయంలో జర్నలిస్టులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. అరెస్టు చేసిన వారు జర్నలిజంలో నిరంతరం కొనసాగుతున్న సీనియర్ జర్నలిస్టులు కావడం గమనార్హం. వారి అరెస్టును తీవ్రంగా ఖండిస్తూ, జర్నలిస్టుల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేస్తోంది.

ఈ సందర్భంగా టీటీడబ్ల్యూజేఏ తరపున మీడియా సంస్థలకు ఒక సూచన కూడా చేస్తున్నాము. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారుల విషయంలో నిరాధారమైన వార్తలను ప్రచురించవద్దని, ఆధారాలు ఉన్నప్పుడే వార్తలను ప్రసారం/ప్రచురించాలి అని సూచిస్తున్నాము. అలాగే ఎవరి వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసే విధంగా కథనాలు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఆయా మీడియా సంస్థలదే. అయితే, జర్నలిస్టులపై కేసులు నమోదు చేసి, తీవ్రవాదుల మాదిరిగా అర్ధరాత్రి అరెస్టులు చేయడం ఏ మాత్రం సమంజసం కాదు. కాబట్టి ప్రభుత్వం వెంటనే ఈ విషయంలో చొరవ తీసుకొని, అరెస్టు చేసిన జర్నలిస్టులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నది’ అన్నారు.

# సర్పంచ్ శంకరవ్వను సన్మానించిన బీజేపీ నాయకులు.

**బలగం టీవీ, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం నర్సక్కపేట గ్రామ సర్పంచ్ గా బెంద్రం శంకరవ్వ ఎన్నికైన సందర్భంగా శంకరవ్వ తో పాటు వారి కుమారుడైన బెంద్రం తిరుపతిరెడ్డిని రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల బిజెపి పార్టీ నాయకులు బుధవారం రోజున మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నీలోజిపల్లి బిజెపి పార్టీ నాయకులు ఆవుల లక్ష్మారెడ్డి, మల్లాపూర్ పరుశరాములు, మానువాడ జనగాం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# దంపతుల గలీజ్ దందా..

- అప్పులు తీర్చుకోవడానికి అడ్డదారులు
- మగవారిని ఆకర్షించి, ఆపై నగ్న వీడియోలతో బ్లాక్‌మెయిల్
- 100 మందికి పైగా బలి!



**బలగం టీవీ, కరీంనగర్:**

అప్పులు తీర్చుకోవడానికి అడ్డదారులు తొక్కిన ఓ దంపతుల ఉదంతం వెలుగులోకి వచ్చింది. అందాన్ని ఎరగా వేసి, సామాజిక మాధ్యమాల ద్వారా మగవారిని ఆకర్షించి, ఆపై నగ్న వీడియోలతో బ్లాక్‌మెయిల్ చేస్తూ లక్షల రూపాయలు వసూలు చేస్తున్న కిలాడీ దంపతులను కరీంనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు.

మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట మండలం వెంకటరావు పేటకు చెందిన 31 ఏండ్ల ఒక వ్యక్తి కరీంనగర్‌లో మార్బుల్ వ్యాపారం, ఇంటీరియర్ డెకరేషన్ చేసేవాడు. అతనికి 29 ఏళ్ల మహిళతో వివాహమైంది, వారికి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. అయితే, వ్యాపారంలో నష్టాలు రావడం, కొనుగోలు చేసిన ప్లాటుకు ఈఎంఐలు కట్టడం కష్టంగా మారడంతో ఈ దంపతులు దారి తప్పారు. సులభంగా డబ్బు సంపాదించేందుకు 'హనీట్రాప్'ను వృత్తిగా ఎంచుకున్నారు.

భార్య అందమైన ఫోటోలతో సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ పురుషులను ఆకర్షించేది. ఆమె వలలో పడిన వ్యాపారవేత్తలు, యువకులను తన అపార్ట్‌మెంట్‌కు పిలిపించుకునేది. వారు సన్నిహితంగా ఉన్న సమయంలో భర్త రహస్యంగా వీడియోలు తీసేవాడు. ఆ వీడియోలను చూపిస్తూ బాధితులను భయభ్రాంతులకు గురిచేసి, లక్షల రూపాయలు డిమాండ్ చేసేవారు.

గడిచిన మూడేళ్లలో వీరు సుమారు 100 మందికి పైగా పురుషులను లోబరుచుకుని డబ్బులు వసూలు చేసినట్లు విచారణలో తేలింది. ఇటీవల కరీంనగర్‌కు చెందిన ఓ లారీ వ్యాపారిని నగ్న వీడియోలతో బెదిరించి ఇప్పటికే రూ.13 లక్షలు వసూలు చేశారు. మళ్లీ మరో రూ.5 లక్షలు కావాలని వేధించడంతో, తట్టుకోలేకపోయిన బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. రంగంలోకి దిగిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో పరిచయం లేని వ్యక్తులతో అతిగా సన్నిహితంగా ఉండటం, గుడ్డిగా నమ్మి వారిని కలవడానికి వెళ్లడం ప్రమాదకరమని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

# సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**బలగం టీవీ, వేములవాడ:**

వేములవాడ పట్టణంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంప్రదాయబద్ధంగా గంగిరెద్దులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంక్రాంతి రైతుల పండుగగా గుర్తింపు పొందిందని పేర్కొన్న ఆయన, రైతుల కష్టఫలితమే ఈ పండుగకు మూలమని అన్నారు. రైతులు సుఖసంతోషాలతో, సమృద్ధిగా ఉండాలని, మంచి పంటలు పండాలని ఆకాంక్షించారు. సంక్రాంతి పండుగ ప్రతి ఇంటికి ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం తీసుకురావాలని ఆయన మనస్ఫూర్తిగా కోరుకున్నారు.. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటూ ముందుకు సాగాలని, అదే విధంగా రైతుల అభివృద్ధితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని తెలిపారు. రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎల్లవేళలా కట్టుబడి ఉందని అన్నారు. ప్రజలందరికీ మకర సంక్రాంతి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గంగిరెద్దుల వారిని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు.

# గండి లచ్చపేటలో వైభవంగా సంక్రాంతి ముగ్గుల పోటీలు..

- బీఆర్ఎస్ నేత బండి దేవేందర్ యాదవ్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు
- ముగ్గుల పోటీలకు ముఖ్య అతిథులుగా హాజరై పరిశీలించిన సర్పంచ్ జంగిటి అంజయ్య ఉప సర్పంచ్ పుట్ట భాను

**బలగం టీవీ, తంగళ్ళపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం గండి లచ్చపేట గ్రామంలో మహిళలకు ముగ్గుల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ ఫ్యాక్స్ డైరెక్టర్ బండి దేవేందర్ యాదవ్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ ఆవరణలో ఈ పోటీలను నిర్వహించారు.గ్రామ పరిసరాల్లోని మహిళలు, యువతులు పెద్ద ఎత్తున ఈ పోటీల్లో పాల్గొని, తమ నైపుణ్యంతో రంగురంగుల ముగ్గులను తీర్చిదిద్దారు. గ్రామీణ సంస్కృతి ఉట్టిపడేలా వేసిన ఈ ముగ్గులు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సర్పంచ్ జంగిటి అంజయ్య, ఉప సర్పంచ్ పుట్ట భాను ముఖ్య అతిథులుగా హాజరై ముగ్గులను పరిశీలించారు. ఈ ముగ్గుల పోటీలో విజేతలుగా మొదటి బహుమతి కాసారపు హరీష, రెండో బహుమతి బల్లెపూ ప్రసన్న, మూడో బహుమతి పొట్టోళ్ల శ్రావణి లు నిలిచారు.



ఈ సందర్భంగా ముగ్గుల పోటీ నిర్వాహకులు బండి దేవేందర్ యాదవ్ మాట్లాడుతూ.. విజేతలకు మొదటి బహుమతిగా 3000 రూపాయల విలువైన పట్టుచీర, రెండో బహుమతిగా 2000 రూపాయల చీర, మూడో బహుమతిగా 1000 రూపాయల చీరను అందజేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మండల ప్రజలకు, గ్రామస్తులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు పుట్ట దేవరాజ్, భామనగారి రవి, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షులు బోన్ల శ్రీశైలం, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు బుచ్చన్న గారి శ్రీనివాస్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు బల్లెపూ శ్రీనివాస్, నాయకులు పొన్నం శంకర్, దేవుని రమేష్ మరియు మహిళలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మండేపల్లిలో ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నీ




**బలగం టీవీ, తంగళ్ళపల్లి:**

సంక్రాంతి సంబరంలో భాగంగా మండేపల్లి గ్రామంలోని యువకుల్లో క్రిడ స్ఫూర్తిని పెంచేందుకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. టైటాన్ టైగర్స్ కెప్టెన్ నరేందర్ టీం గెలుపొందారు. మాస్టర్ బ్లాస్టర్ టీం యాస రాజేష్ రన్నరప్ అందుకున్నారు.

## విజేతలకు బహుమతులు ప్రధానం అందించిన సర్పంచ్ గాధగోని సాగర్

ఈ సందర్భంగా మండేపల్లి గ్రామ సర్పంచ్ గాధగోని సాగర్ మాట్లాడుతూ.. యువకులు చదువుతోపాటు క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని క్రీడల వల్ల మానసికొల్లాసం పెంపందుతుందన్నారు. ప్రతి సంవత్సరం సంక్రాంతి సందర్భంగా యువకులకు క్రికెట్ పోటీలు ఫ్రెండ్లి వాతావరణం లో కొనసాగుతున్నయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ యాస సందీప్, వార్డ్ మెంబెర్స్ అమర గొండ ప్రభుదాస్, దేవదాస్, మధు, శశికుమార్, ఆర్గనైజషన్ కృష్ణ రెడ్డి, రాము, నరేష్, దుర్గరెడ్డి, కుమార్, కొండయ్య, క్రాంతి, రవి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఖాళీల భర్తీకి కట్టుబడున్నాం

(మొదటి పేజీ తరువాయి)

2047 నాటికి భారత్ ప్రపంచంలోనే అతి బలమైన ఆర్థిక వ్యవస్థగా ఎదగాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని, తెలం గాణను 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముం దుకు సాగుతున్నామని తెలిపారు. ఇప్పుడు ఉద్యోగాల్లో చేరుతున్న వారంతా 2047 నాటికీ ప్రభుత్వ సేవల్లో కొనసాగుతారని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే పేద ప్రజలను తమ తల్లిదండ్రుల్లా భావించి గౌరవంగా చూడాలని సూచించారు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని, వారి జీతంలో 10 నుంచి 15 శాతం కోత విధించి ఆ మొత్తాన్ని తల్లిదండ్రుల ఖాతాలో జమ చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎంపికైన అభ్యర్థులకు ముఖ్యమంత్రి నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, మహమ్మద్ అజారుద్దీన్, సలహాదారు వేం నరేందర్ రెడ్డి, షబ్బీర్ అలీ, పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు తదితర అధికారులు పాల్గొన్నారు.

# రాజన్న ఆలయ అభివృద్ధికి భారీ నిధులు

(మొదటి పేజీ తరువాయి)



భవనం నిర్మాణం జరుగుతుందని, మండలాల్లోనూ భవనాల నిర్మాణానికి అవకాశం కల్పిస్తున్నామనిఅన్నారు. . మహిళా సంఘాల ద్వారా వడ్డీ లేని రుణాలు, స్వయం ఉపాధి యూనిట్లు, ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులు, సోలార్ యూనిట్లు వంటి అవకాశాలు కల్పిస్తున్నామని అన్నారు.కోటి మంది మహిళలను కోటి ఈశ్వరులుగా మార్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్నబియ్యం, రూ.2 లక్షల రుణమాఫీ వంటి పథకాలు అమలు చేస్తున్నామని అన్నారు.

**వేములవాడను టెంపుల్ సిటీగా అభివృద్ధి చేస్తాం : ఆది శ్రీనివాస్**

వేములవాడ పట్టణాన్ని టెంపుల్ సిటీగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తోందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలో వందల కోట్ల రూపాయలతో రోడ్లు, జంక్షన్లు, సుందరీకరణ, మౌలిక వసతుల అభివృద్ధి చేపడుతున్నమని అన్నారు.ఆలయ అభివృద్ధికి రూ.150 కోట్లు, రోడ్డు వెడల్పుకు రూ.47 కోట్లు, సుందరీకరణకు రూ.2.65 కోట్లు, జంక్షన్ల అభివృద్ధికి కోటి రూపాయలు మంజూరు చేసినట్లు వివరించారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

**ఆలయ అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం అదృష్టం : గరిమ అగ్రవాల్**

శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం కావడం అదృష్టమని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. తిప్పాపూర్ జంక్షన్‌ను శివుడి థీమ్‌తో అభివృద్ధి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ రాకేష్, గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు నాగుల సత్యనారాయణ గౌడ్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, ఆర్డీఓ రాధాభాయ్, తహసీల్దార్ విజయ ప్రకాశ్ రావు తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న ఆలయ విస్తరణ పనుల్లో వేగం పెంచాలి

- **మంత్రి సీతక్క**

**బలగం టీవి, వేములవాడ**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ విస్తరణ పనుల్లో వేగం పెంచాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, గ్రామీణ నీటి పారుదల, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సూచించారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ విస్తరణ పనులు ఆర్ అండ్ బీ ఆధ్వర్యంలో కొనసాగుతుండగా, శుక్రవారం మంత్రి. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ విస్తరణ పనులు, మ్యాపులు పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. పరిశీలనలో ఆర్ అండ్ బీ ఈఈ నరసింహాచారి, డీఈ శాంతయ్య, ఆలయ ఈఓ రమాదేవి, వేములవాడ ఆర్డీఓ రాధాభాయ్, తహసీల్దార్ విజయ ప్రకాశ్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# ఇదే చివరి అవకాశం

(మొదటి పేజీ తరువాయి)

విచారణ కొనసాగాల్సి ఉందని పేర్కొన్నారు. "ఏడుగురు ఎమ్మెల్యేల పిటిషన్లపై విచారణ పూర్తిచేసి నిర్ణయం తీసుకున్నాం. స్పీకర్‌కు కంటి శస్త్రచికిత్స జరగడం, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ మారడం వంటి కారణాలతో కొంత ఆలస్యం జరిగింది. నాలుగు వారాల సమయం ఇస్తే విచారణ పూర్తి చేస్తాం" అని కోర్టును కోరారు.

**బీఆర్ఎస్ తరఫున ఘాటైన వాదనలు**

బీఆర్ఎస్ తరఫున సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు వాదనలు వినిపిస్తూ, "పది మంది ఎమ్మెల్యేలు పార్టీ మారారు. ఒక ఎమ్మెల్యే ఏకంగా అధికార పార్టీ తరఫున ఎన్నికల్లో పోటీ చేశారు. అయినా పార్టీ మారలేదని వాదిస్తున్నారు. దీనిలో న్యాయం ఎక్కడుంది? మూడు నెలలకుపైగా గడిచిపోయినా స్పీకర్ ఇప్పటికీ విచారణ పూర్తి చేయలేదు. ప్రతిసారీ గడువు పొడిగింపునే కోరుతున్నారు" అని తీవ్రంగా వ్యాఖ్యానించారు.

**బీఆర్ఎస్ వాదనలతో ధర్మాసనం ఏకీభవన**

బీఆర్ఎస్ లాయర్ వాదనలతో ధర్మాసనం ఏకీభవించింది. "ఇప్పటికే తగినంత సమయం ఇచ్చాం. ఈ పాటికే నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇదే చివరి అవకాశం. మిగిలిన ముగ్గురు ఎమ్మెల్యేలపై వెంటనే నిర్ణయం తీసుకోండి. లేకుంటే పరిణామాలు తప్పవు" అని స్పీకర్‌ను ఉద్దేశించి సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

మిగిలిన ఎమ్మెల్యేలపై విచారణకు నాలుగు వారాల గడువు ఇవ్వాలని అభిషేక్ సంఘ్వీ కోరగా, రెండు వారాల్లో పురోగతి కనిపిస్తే నాలుగు వారాల సమయం ఇస్తామని ధర్మాసనం తెలిపింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

# ధరణి-భూ భారతి భూస్కాం గుట్టు రట్టు

**బలగం టీవి, జనగామ**

ధరణి, భూ భారతి పోర్టల్లలో భూ నమోదు ప్రక్రియలో భారీగా అక్రమాలకు పాల్పడిన ముఠాను జనగాం పోలీసులు బట్టబయలు చేశారు. జనగాం, యాదాద్రి (భువనగిరి) జిల్లాల్లో భూ రిజిస్ట్రేషన్ల పేరుతో ప్రభుత్వ ఖజానాకు రూ.3.90 కోట్ల నష్టం కలిగించిన కేసులో 15 మందిని పోలీసులు అరెస్టు చేశారు. మరో తొమ్మిది మంది నిందితులు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

**భారీగా స్వాధీనం**

ఈ కేసులో నిందితుల నుంచి రూ.63.19 లక్షల నగదు, బ్యాంకు ఖాతాలో ఉన్న రూ.లక్ష, సుమారు రూ.1 కోటి విలువైన ఆస్తి పత్రాలు, ఒక కారు, రెండు ల్యాప్‌టాప్‌లు, ఐదు డెస్క్‌టాప్ కంప్యూటర్లు, 17 మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**ప్రధాన నిందితుల వివరాలు**

శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ సున్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ, యాదగిరిగుట్ట (భువనగిరి జిల్లా)లో ఆన్‌లైన్ సేవా కేంద్రాన్ని నిర్వహిస్తున్న పసునూరి బసవరాజు, జెల్లా పండు ఈ స్కాం వెనుక కీలక పాత్ర పోషించారని వెల్లడించారు.

**స్కాం ఎలా జరిగింది?**

నిందితుల్లో ఒకరైన గణేష్ ఆన్‌లైన్ సేవా కేంద్రాల నిర్వాహకులను సంప్రదించి, రిజిస్ట్రేషన్ ఫీజును ఎన్ఆర్ఐ ఖాతా ద్వారా చెల్లిస్తానని నమ్మబలికాడు. రైతుల నుంచి మొత్తం రిజిస్ట్రేషన్ మొత్తాన్ని మీ–సేవ కేంద్రాల ద్వారా వసూలు చేసి, అందులో కొంత మొత్తాన్ని కమిషన్‌గా ఆన్‌లైన్ సేవా కేంద్రాలు, మధ్యవర్తులకు పంపిణీ చేశాడు. మిగిలిన మొత్తాన్ని ప్రధాన నిందితులకు చేరవేశాడు.

ప్రధాన నిందితుడు బసవరాజు ధరణి, భూ భారతి వెబ్‌సైట్లలోని 'ఇన్‌స్పెక్ట్ ఎడిట్ అప్లికేషన్ల ఆప్షన్‌ను ఉపయోగించి చలాన్ మొత్తాన్ని తగ్గించేవాడు. ఆ తర్వాత మొబైల్ ద్వారా చలాన్‌ను ఎడిట్ చేసి రైతులకు పంపించేవాడు. ప్రభుత్వం వసూలు చేసిన ఫీజుకు సంబంధించిన రసీదులను మొబైల్ యాప్ ద్వారా మార్పులు చేసి, తక్కువ మొత్తాన్ని చూపే నకిలీ చలాన్లను తహసీల్దార్ లేదా రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సమర్పించేవారు.

జనగాం, భువనగిరి జిల్లాల్లో మొత్తం 1,080 భూ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లలో నిందితులు మోసాలకు పాల్పడ్డారని పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారానికి సంబంధించి జనగాం జిల్లాలో 7, భువనగిరి జిల్లాలో 15 కేసులు నమోదైనట్లు సీపీ తెలిపారు.

ఈ ముఠాను పట్టుకున్నందుకు జనగాం డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏఎస్పీ పండరి చేతన్, జనగాం ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి, రఘునాథపల్లి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డితో పాటు ఇతర ఎస్ఐలు, సిబ్బందిని వరంగల్ పోలీస్ కమిషనర్ సున్‌ప్రీత్ సింగ్ అభినందించారు.

# ఆదిలాబాద్ అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక

(మొదటి పేజీ తరువాయి)



కలిసి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్మల్ పట్టణంలో నిర్వహించిన 'ప్రజా పాలన -- ప్రగతి బాట' బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు.

తెలంగాణలో అత్యంత వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాకు రావాల్సిన అభివృద్ధి, నీటి వనరులు ఇప్పటివరకు అందలేదని పేర్కొన్నారు. పాలమూరు జిల్లాను ఏ విధంగా అభివృద్ధి చేస్తున్నామో, అదే స్థాయిలో ఆదిలాబాద్ జిల్లాను కూడా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. చనాక––కొరాట బ్యారేజీకి మాజీ మంత్రి చిలుకూరి రామచంద్రారెడ్డి పేరు, సదర్మట్ బ్యారేజీకి స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ మంత్రి పి. నర్సారెడ్డి పేరు పెట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ విషయమై వెంటనే చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ మంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. పదేళ్ల పాటు పూర్తి చేయని చనాక--కొరాట ప్రాజెక్టును ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తి చేశామని గుర్తు చేశారు. నిర్మల్‌లో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేస్తామని, బాసర ఐఐఐటీలో విశ్వవిద్యాలయం తప్పనిసరిగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. వర్సిటీ ఎక్కడ ఏర్పాటు చేయాలనే చర్చల్లో కాలం వృథా చేయకుండా బాసరలోనే ప్రారంభిస్తున్నామని చెప్పారు.

ఆదిలాబాద్ జిల్లాలో రాష్ట్రంలోనే అతిపెద్ద పారిశ్రామిక వాడను అభివృద్ధి చేసి, దేశంలోని పరిశ్రమలు ఇక్కడ పెట్టుబడులు పెట్టేలా చర్యలు తీసుకుంటామని సీఎం వెల్లడించారు. ఇందుకోసం సుమారు 10 వేల ఎకరాల భూమి సేకరించాల్సి ఉంటుందని తెలిపారు. ఎన్నికల సమయంలో రాజకీయాలు వేరని, ఇప్పుడు ప్రజల కోసం అందరూ కలిసిమెలిసి పనిచేయాల్సిన సమయమని పిలుపునిచ్చారు. ఎర్రబస్సు కూడా రాని పరిస్థితి నుంచి ఎయిర్ బస్సు వచ్చే స్థాయికి ఆదిలాబాద్‌ను అభివృద్ధి చేసి, ప్రధానమంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం నిర్వహించే స్థాయికి తీసుకెళ్తామన్నారు.

రాష్ట్రానికి సంబంధించిన అనుమతులు, నిధుల కోసం ఢిల్లీకి వెళ్లి ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులను కలుస్తున్నామని, అదే తరహాలో పార్టీలకు అతీతంగా రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ఫిబ్రవరి మొదటి వారంలో ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించి, ఆ మరుసటి రోజు అధికార యంత్రాంగంతో సమావేశం ఏర్పాటు చేసి నివేదిక సమర్పించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రిని ఆదేశించారు. ఆ నివేదిక ఆధారంగా బడ్జెట్ సమావేశాల్లో అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. తుమ్మిడిహెట్టిలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత--చేవెళ్ల ప్రాజెక్టును తప్పనిసరిగా నిర్మిస్తామని, ఇందుకు డీపీఆర్ సిద్ధమవుతోందని చెప్పారు. మహారాష్ట్ర నుంచి అవసరమైన అనుమతుల కోసం ప్రధానమంత్రి సహకారం కోరుతామని తెలిపారు. నాగోబా జాతర అభివృద్ధికి రూ.22 కోట్లు మంజూరు చేస్తామని, మేడారం సమ్మక్క--సారలమ్మ మందిరాన్ని కుంభమేళా స్థాయిలో రూ.300 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. "మేం పాలకులం కాదూ ప్రజల సేవకులం. మన భవిష్యత్ తరాల కోసమే ఈ అభివృద్ధి కార్యక్రమాలు" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎంపీ గోడం నగేష్‌తో పాటు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నామని తెలిపారు. డెస్టినేషన్ తెలంగాణ – ప్రపంచ పర్యాటక కేంద్రంగా.. తెలంగాణలోని సహజ సౌందర్యాన్ని, చారిత్రక వారసత్వాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. "డెస్టినేషన్ తెలంగాణ" అనే బ్రాండ్‌ను బలోపేతం చేస్తూ, కేవలం దేశీయ పర్యాటకులనే కాకుండా విదేశీ పర్యాటకులను కూడా ఆకర్షించేలా ఇటువంటి సాహసోపేత క్రీడలు ఎంతో దోహదపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. పర్యాటకులు కేవలం సందర్శించడమే కాకుండా, ఒక గొప్ప అనుభూతిని పొందేలా వినూత్న కార్యక్రమాలను రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.

ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన పర్యాటక విధానం ద్వారా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామని, ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షిస్తూ, భాగస్వామ్య పద్ధతిలో ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, నాణ్యమైన సేవలను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ఈ అభివృద్ధి ద్వారా స్థానిక యువతకు ఉపాధి, ఆదాయ మార్గాలను పెంచడమే లక్ష్యమన్నారు.

## నింగిలో.. రంగుల కేళి!

**పరేడ్ గ్రౌండ్స్‌లో కనువిందుగా 'హాట్ ఎయిర్ బెలూన్ల ఫెస్టివల్.. ప్రారంభించిన మంత్రి జూపల్లి కృష్ణారావు..**



గ్రేటర్ గగనతలం రంగులమయమైంది. చారిత్రక పరేడ్ మైదానంలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'హాట్ ఎయిర్ బెలూన్ల ప్రదర్శన నగరవాసులను మంత్రముగ్ధులను చేస్తోంది. శుక్రవారం సాయంత్రం రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. గాలిలో తేలియాడే రంగురంగుల బెలూన్లకు ఆయన పచ్చజెండా ఊపి నింగిలోకి పంపారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ పర్యాటక రంగానికి అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడమే మా లక్ష్యం. సాహస క్రీడలు, వినూత్న ఉత్సవాల ద్వారా పర్యాటకులను ఆకర్షిస్తాం" అని పేర్కొన్నారు. పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, ఎండీ క్రాంతి వల్లూరి పర్యవేక్షణలో ఏర్పాటైన ఈ వేడుకలో పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఆకాశంలో విహరిస్తున్న భారీ బెలూన్లను చూసేందుకు నగరవాసులు భారీగా తరలివచ్చారు. చిన్నారుల కేరింతలు, సందర్శకుల సెల్ఫీలతో పరేడ్ గ్రౌండ్స్ ప్రాంగణం కళకళలాడింది.